సాక్షి
హైదరాబాద్ । ఆదివారం । 11 । మే । 2025

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మల్లాపూర్: 33/11 కేవీ నాచారం సబ్‌స్టేషన్ పరిధిలో 11కేవీ చందమామ ఫీడర్ పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు చందమామ ప్రెస్‌క్లబ్ లైన్, ఐడీఏ నాచారం రోడ్డు నెంబర్-9లో విద్యుత్ సరఫరాను నిలిపేస్తున్నట్లు నాచారం ఏఈ నాగరాజు తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

దోమల నివారణకు ప్రత్యేక చర్యలు



మౌలాలి: దోమల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నట్లు మౌలాలి డివిజన్ కార్పొరేటర్ సునీతాశేఖర్‌యాదవ్ అన్నారు. ఎంటమాలజీ విభాగ అధికారులు, సిబ్బందితో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. అనేక వ్యాధులు, రుగ్మతలకు కారణమైన దోమలను నివారించేందుకు ప్రతి ఒక్కరూ వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. రోజూ ఫాగింగ్ చేపట్టాలని సంబంధిత సిబ్బందిని కోరారు. జీహెచ్‌ఎంసీ ఏఈ వనజ, మల్కాజ్‌గిరి సర్కిల్ ఫాగింగ్ ఇన్‌చార్జ్ నజీర్, షౌకత్ తదితరులున్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



పనులను పరిశీలిస్తున్న నాయకులు

రామంతాపూర్: రాంరెడ్డినగర్‌లోని 2, 3 వీధుల్లో ఉన్న విద్యుత్ స్తంభాల నుంచి కరెంట్ తీగలు గత కొన్నేళ్లుగా కిందకు వేలాడుతూ ప్రమాదకరంగా మారాయి. విషయం తెలుసుకున్న ఉప్పల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఆకారపు అరుణ్‌పటేల్ శనివారం విద్యుత్ అధికారులను సంప్రదించి వీటిని సరి చేయించారు. రాంరెడ్డినగర్ సంక్షేమ సంఘం ప్రధాన కార్యదర్శి రాకేష్, లైన్‌మెన్ వెంకటేష్, యూత్ కాంగ్రెస్ నాయకులు భాను, మల్లయ్య, మహేష్, నవీన్, అశోక్, సందీప్, భాస్కర్, నగేష్ తదితరులున్నారు.

సీసీరోడ్డు పనుల పరిశీలన

మల్లాపూర్: డివిజన్ పరిధిలోని బ్రహ్మపురికాలనీ, జేఎస్‌ఎన్‌యూఆర్‌ఎం కాలనీ ఫేస్-2లో నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను శనివారం కార్పొరేటర్ పన్నాల దేవేందర్‌రెడ్డి పరిశీలించారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని ఆయన సూచించారు. జీహెచ్‌ఎంసీ ఏఈ స్రవంతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రామారావు, నాయకులు, బస్తీవాసులు ప్రవీణ్, మల్లేష్, శ్రీనివాస్, యాదగిరిగౌడ్, నర్సింగ్‌రావు, రామిరెడ్డి, తిరుపతి, విష్ణువర్ధన్, శ్రీనివాస్, రఘు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలి

గౌతంనగర్: అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మల్లు లక్ష్మి అన్నారు. శనివారం గౌతంనగర్ డివిజన్ పరిధిలోని ఐద్వా మల్కాజిగిరి మండల కార్యాలయంలో ఐద్వా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీల మేరకు ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేయాలన్నారు. కొత్త రేషన్‌కార్డులను ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎం.వినోద, ఎస్.సృజన, మంగ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

కురుమ సంఘం భవన శంకుస్థాపనకు ఎంపీకి ఆహ్వానం



ఉప్పల్: 16న ఉప్పల్ కురుమ సంఘం భవన నిర్మాణ శంకుస్థాపనకు ఎంపీ ఈటల రాజేందర్‌ను ఆహ్వానించారు. కురుమ సంఘం ప్రతినిధులు, గౌరిగే కృష్ణ, మల్లేష్, పెద్ద మల్లేష్, హనుమంతు, కృష్ణ, ఐలయ్య తదితరులున్నారు.

ఓ వైపు దుమ్ము.. మరోవైపు మురుగు!

● మేడ్చల్‌లో జాతీయ రహదారిపై వాహనదారుల అవస్థలు ● రహదారి పక్కనే పారుతున్న మురుగు ● రోడ్డుపై నీరు పోయకపోవడంతో రేగుతున్న దుమ్ము





మేడ్చల్: అది దేశంలోని ఉత్తర భారత దేశం, దక్షిణ భారత దేశాన్ని కలిపే అతిపెద్ద జాతీయ రహదారి. తమిళనాడు కన్యాకుమారి నుంచి ప్రారంభమై జమ్మూకశ్మీర్‌లోని శ్రీనగర్ వరకు వెళ్లే 44వ జాతీయ రహదారి మేడ్చల్‌లో అభాసుపాలవుతుంది.

కనీస నిబంధనలు పాటించని కాంట్రాక్టర్

◆ మేడ్చల్ పట్టణ పరిధిలో కొంపల్లి నుంచి ఎల్లంపేట్ వరకు రహదారి పనులు జోరుగా సాగుతున్నాయి. పనుల్లో భాగంగా ఫ్లై ఓవర్ల నిర్మాణం, అండర్ పాస్‌ల నిర్మాణం, రోడ్డు విస్తరణ పనులు పడుతూ.. లేస్తూ నిత్యం జరుగుతున్నాయి. కాంట్రాక్టర్ కనీస నిబంధనలు పాటించకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

నిత్యం వేల వాహనాలు

◆ 44వ జాతీయ రహదారి దేశంలో దక్షిణం నుంచి ప్రారంభమై ఉత్తరాన్ని కలిపే రోడ్డు. దేశంలో ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి సరుకులు, ప్రజా రవాణ చేసేందుకు నిత్యం వేల వాహనాలు రహదారిపై తిరుగుతున్నాయి. దీంతో 44వ జాతీయ రహదారిపై 24 గంటల వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. వాహనాల సంఖ్య అధికం కావడంతో నిర్మాణ రోడ్డుతో అన్ని ఇబ్బందులు ఎదురౌతున్నాయి.

రహదారి వెంట మురుగు..

◆ మేడ్చల్ పట్టణ పరిధిలో జాతీయ రహదారికి ఇరువైపుల అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు ఉన్నాయి. నిర్మాణ సంస్థలు అడ్డగోలుగా రోడ్డు పక్కన తవ్వకాలు చేస్తుండటంతో అప్పటికే ఉన్న మురుగు కాల్వల పైపులైన్ పగిలిపోవడంతో మురుగు రోడ్ల పైనే ప్రవహిస్తున్నాయి.

◆ మేడ్చల్ బస్టాండ్, పోలీస్‌స్టేషన్, ఆర్టీసీ కాలనీ చౌరస్తా, రహదారి బంగ్లా సమీపంలో తదితర ప్రాంతాల్లో తరుచూ మురుగు నీటి పైపులైన్ పగిలి రహదారి వెంట పారుతూ.. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి.రహదారి వెంట ఉన్న కాలనీలలోకి మురుగు వెళ్లి నానా ఇబ్బందులు సృష్టిస్తున్నాయి.

దుర్వాసనతో ఇబ్బంది

◆ రహదారి వెంట మురుగు కారణంగా దుర్వాసనతో వాహనదారులు, పట్టణంలో పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారి వెంబడి మురుగు కిలోమీటర్ మేర ప్రవహిస్తుండటంతో ప్రధానంగా ద్విచక్రవాహదారులు ఓ వైపు దుర్వాసన, మరోవైపు రోడ్డుపై దుమ్ముతో అవస్థలు చూడాల్సి వస్తోంది.

అధికారుల మధ్య సమన్వయం కరువు

◆ మున్సిపల్ అధికారులు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, కాంట్రాక్టర్ మధ్య సమన్వయం లేకపోవడంతో వాహనదారులకు తరుచూ ఇబ్బందులు ఎదురౌతున్నాయి.

నిత్యం రేగుతున్న దుమ్ము

◆ రోడ్డుపై నిర్మాణ పనులు జోరుగా సాగుతుండటంతో నిర్మాణ పనులకు ఉపయోగించే మట్టి, సిమెంట్ తవ్వకాలు చేసే వాహనాలతో రహదారి వెంట మేడ్చల్ పట్టణ పరిధిలో నిత్యం దుమ్ము రేగుతూ వాహనదారుల కళ్లల్లో పడటంతో ఇబ్బందులు పడుతున్నారు.

నామమాత్రపు చర్యలు

◆ రోడ్డు పక్కన వ్యాపారాలు చేసే వ్యాపారులు, కొనుగోళ్ల కోసం వచ్చే వినియోగదారులకు అవస్థలు తప్పడం లేదు. కాంట్రాక్టర్ దుమ్ముపైకి లేవకుండా నిత్యం రెండు పూటలా రహదారిపై నీరు పోయాల్సి ఉండగా.. పట్టించుకోవడం లేదు. అక్కడక్కడ నామమాత్రంగా పోస్తున్నా.. ప్రజలకు ఇబ్బందులు మాత్రం తప్పడం లేదు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌పై తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వాసుపత్రిలో అధునాతన దంత వైద్య సేవలు

అల్వాల్: మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వాసుపత్రిలో అధునాతన దంత వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వైద్యాధికారులు కోరారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి తీవ్ర దంత సమస్యలతో బాధపడుతున్న 35 ఏళ్ల నర్మదకు మల్కాజిగిరి జిల్లా ప్రభుత్వాసుపత్రిలో అధునాతన దంత వైద్య చికిత్సను విజయవంతంగా చేశామని జిల్లా వైద్యాధికారి డాక్టర్ ఉమాగౌరీ తెలిపారు. దంత సమస్యలతో బాధపడుతున్న వారు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లకుండా ప్రభుత్వాసుపత్రిలోని వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

అలరించిన నృత్య ప్రదర్శన

ఉప్పల్: ఉప్పల్ మినీ శిల్పారామంలో మాతృదినోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శ్రీ రాగరమ్య కల్చరల్ సంస్థ వ్యవస్థాపకులు రమ్య ఆధ్వర్యంలో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. శ్రీ విఘ్నరాజం భజే, భావములోన, గణేషపుష్పాంజలి, ఇట్టి ముద్దులాడి, స్వాగతం కృష్ణ తదితర అంశాలపై నృత్య ప్రదర్శన చేశారు.



సాంస్కృతిక ప్రదర్శనతో కళాకారులు

చిన్నారులకు ఉచితంగా వైద్య పరీక్షలు



అల్వాల్: వేసవి సెలవుల్లో భాగంగా విద్యార్థులకు సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శనివారం ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. ఉచితంగా పెయింటింగ్, నృత్యం, పలు రకాల క్రీడలతో పాటు దేశభక్తిని పెంపొందించడం, పెద్దలపట్ల గౌరవం, భారత సంస్కృతి సంప్రదాయాలను ప్రతిబింబించేలా నడవడికను అలవరచుకోవడం వంటి అంశాలపై శిక్షణను ఇచ్చినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆర్మీ దంత వైద్యాసుపత్రి వైద్య బృందం, సత్యసాయి సేవా సమితి ప్రతినిధులు డీసీ. ఆనంద్, ఎం. సోమసుందరం, సేతురాం, ఈశ్వరరావు, లీలావతి, వసంత, మాధురి, పద్మ , సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

గొల్ల కురుమలకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి



కీసర: కీసర మండలం గొర్రెల, మేకల పెంపకందారుల సంఘం (జీఎంపీఎస్) మొదటి మహాసభలు శనివారం మల్లన్న దేవాలయం వద్ద జరిగాయి. ఈ సందర్భంగా జీఎంపీఎస్ జిల్లా అధ్యక్షులు మేకల కుమార్, ప్రధాన కార్యదర్శి కొమురయ్య హాజరై మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు అధికారంలోకి వచ్చిన 3 నెలల్లో గొల్ల కురుమలకు రూ.2 లక్షల నగదు బదిలీ ద్వారా రెండో విడత ద్వారా గొర్రెల పంపిణీ చేస్తామని తన మేనిఫెస్టోలో హామీ ఇచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి ఏడాది గడుస్తున్నా.. హామీలు నెరవేర్చడం లేదని ఆరోపించారు. పశు వైద్యశాలలో ఎలాంటి మందులు అందుబాటులో లేవని, గత రెండేళ్ల నుంచి కనీసం నట్టల నివారణ మందులు సైతం ఇవ్వడం లేదని వాపోయారు. ఓ వైపు వీధి కుక్కల దాడులతో వందలాది గొర్రెలు మృత్యువాత పడుతున్నాయని, గొర్రెల కాపరులపై రాష్ట్ర వ్యాప్తంగా ఫారెస్ట్ అధికారుల దాడులు పెరుగుతున్నాయన్నారు. పశుసంవర్ధకశాఖకు ప్రత్యేక మంత్రిని కేటాయించలేదని, సీఎం రేవంత్‌రెడ్డికే ఆ శాఖ ఉండటంతో ఎవరినీ కలిసే అవకాశం లేకుండా పోయాయన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించాలని, లేదంటే జిల్లా వ్యాప్తంగా ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. మాజీ ఎంపీటీసీ, యాదవ సంఘం అధ్యక్షుడు మచ్చని జంగయ్య, సొసైటీ అధ్యక్షుడు మచ్చని ఐలయ్య, కీసరగుట్ట ట్రస్టుబోర్డ్ మెంబర్ రాజు, సొసైటీ ఉపాధ్యక్షులు మచ్చని ఆంజనేయులు తదితరులున్నారు.

కీసర మండల నూతన కమిటీ ఎన్నిక..

కీసర మండల అధ్యక్షుడిగా శ్రీశైలం, ప్రధాన కార్యదర్శిగా చీర గోపాల్, ఉపాధ్యక్షులుగా పాపయ్య, శ్రీశైలం, రావుల ఆంజనేయులు, సహాయ కార్యదర్శులుగా పానిగంటి అశోక్, గొర్ల చిత్తయ్య, సత్తయ్య, కోశాధికారిగా దుర్గం వెంకటేష్‌తో సహా 21 మందితో నూతన కమిటీని ఎన్నుకున్నారు.

శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు కేటాయించండి



ఎమ్మెల్యేకు వినతిపత్రం ఇస్తున్న బస్తీవాసులు

అల్వాల్: మచ్చ బొల్లారం డివిజన్ పరిధిలోని తుర్కపల్లి శ్మశానవాటిక అభివృద్ధికి నిధులు కేటాయించాలని కాలనీవాసులు ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కోరారు. శనివారం ఆయన క్యాంప్ కార్యాలయంలో తుర్కపల్లికి చెందిన హిందూ శ్మశానవాటిక కమిటీ సభ్యులు వినతిపత్రం అందజేశారు. శ్మశానవాటికలో కనీస వసతులు లేవని ఎమ్మెల్యేకు వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన ఆయన అభివృద్ధికి సత్వర చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అల్వాల్ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి, డోలి రమేష్, పరమేష్, పవన్, మంద శోభన్, సూర్యకుమార్, దేవేందర్, కార్తీక్, చంద్రకుమార్, వినోద్, బాలేష్, నవీన్, వెంకట్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా జయగిరి లక్ష్మీనృసింహ స్వామి జన్మోత్సవాలు



ప్రత్యేక పూజలు చేస్తున్న కంటోన్మెంట్ ఎమ్మెల్యే

గౌతంనగర్: జయగిరి లక్ష్మీనృసింహ స్వామి దేవస్థానంలో స్వామివారి జన్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా ప్రారంభమయ్యాయి. శనివారం ఉదయం 5 గంటలకు స్వామివారికి అభిషేకం, 11 గంటలకు సుదర్శన లక్ష్మీనారసింహ హోమం, తదితర పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. నేడు ఉదయం 11 గంటలకు కల్యాణోత్సవం జరుగుతుందని, నిర్వాహకులు ప్రకటించారు. దేవాలయ కమిటీ చైర్మన్ బాలరాజుయాదవ్, మేకల రాము, నాగరాజు, రఘు, పురోహితులు రఘుకిరణాచార్యులు, కొమరయ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ కానిస్టేబుల్ మానవత్వం

మౌలాలి: మతిస్థిమితం కోల్పోయిన ఓ వ్యక్తిని చేరదీసి మల్కాజిగిరి ట్రాఫిక్ కానిస్టేబుల్ మహేష్ మానవత్వం చాటుకున్నాడు. మానసిక రుగ్మతలతో బాధపడుతున్న ఓ వ్యక్తి సైనిక్‌పురి నేరెడ్‌మెట్ పరిధిలోని జేజేనగర్‌లో శనివారం మధ్యాహ్నం ఒంటిపై దుస్తులు లేకుండా రోడ్లపై తిరుగుతూ పాదచారులు, వాహనదారులకు ఇబ్బంది కలిగిస్తున్నాడు.ఇదే ప్రాంతంలో విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్ మహేష్ గమనించి సదరు వ్యక్తిని చేరదీసి వ్యక్తిగత వివరాలపై ఆరా తీసి మతిస్థిమితం కోల్పోయినట్లు గ్రహించాడు. స్థానికుల సాయంతో సదరు వ్యక్తికి స్నానం చేయించి, దుస్తులు వేయించాడు. అనంతరం భోజనం పెట్టి నేరేడ్‌మెట్ పోలీసుల సహకారంతో సంరక్షణ కేంద్రానికి తరలించాడు.



మతిస్థిమితం లేని వ్యక్తికి దుస్తులు వేస్తున్న ట్రాఫిక్ కానిస్టేబుల్

కేన్సర్ నిర్ధారణపై ఉచిత వైద్య శిబిరం



అల్వాల్ బాలాజీ ఆలయంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

అల్వాల్: కిమ్స్ ఫౌండేషన్ టీమ్ విమలాకర్ ఫౌండేషన్ సంయుక్తాధ్వర్యంలో అల్వాల్ బాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ ఆవరణలో శనివారం ఉచిత వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఇటీవల కేన్సర్ వ్యాధి అధికమవుతుందని, ప్రాథమిక స్థాయిలోనే వ్యాధి నిర్ధారణ చేసుకోగలిగితే వ్యాధి నుంచి బయటపడవచ్చన్నారు. ఆరోగ్యవంతులు సైతం ప్రతిఏటా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసుకోవడం వల్ల శరీరంలో ఏర్పడే మార్పులను గుర్తించవచ్చన్నారు. అల్వాల్ వెంకటాపురం మచ్చ బొల్లారం ప్రాంతాల నుంచి వచ్చిన పలువురికి జీర్ణ వ్యవస్థ కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ దినేష్, శ్రీలతారెడ్డి, రాజు, గౌరంగ్‌లతో పాటు బాలాజీ ఆలయ వ్యవస్థాపక చైర్మన్ రాజా సంజయ్ గోపాల్, వెంకట్రామ్‌రెడ్డి, శివరామకృష్ణ, సత్యనారాయణ, రాము తదితరులున్నారు.

మురుగు సమస్యకు పరిష్కారం



కుషాయిగూడ: చర్లపల్లి డివిజన్, సుభాష్‌నగర్ కాలనీ ప్రధానగేటు వద్ద 'మురుగు పరుగు' శీర్షికన శుక్రవారం సాక్షి సమస్యను ప్రచురించింది. దీనిపై కాప్రా శానిటేషన్ అధికారులు స్పందించి, మ్యాన్‌హోల్‌కు మరమ్మతులు చేపట్టారు. మురుగు సమస్యకు పరిష్కారం చూపిన సాక్షికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

కాచిగూడ ఏసీపీగా హరీష్ కుమార్



కాచిగూడ: సీసీఎస్ కార్యాలయంలో ఏసీపీగా పనిచేస్తున్న వై.హరీష్ కుమార్ శనివారం కాచిగూడ ఏసీపీగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా హరీష్ కుమార్ మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణ కోసం రాజకీయాలకతీతంగా ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని కోరారు. కాచిగూడ, అంబర్‌పేట పోలీస్ స్టేషన్ల పరిధిలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా ప్రత్యేక నిఘా ఉం

నాయీబ్రాహ్మణ సంఘాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



ఈఎస్‌ఐ హెల్త్‌కార్డులను అందజేస్తున్న కార్పొరేటర్ బొంతు శ్రీదేవి

కుషాయిగూడ: నాయీబ్రాహ్మణ సంఘం ప్రతినిధులు ఏర్పాటు చేసుకున్న ఈఎస్‌ఐ హెల్త్ ఇన్సూరెన్స్ పథకాన్ని ఆదర్శంగా తీసుకోవాలని కార్పొరేటర్ బొంతు శ్రీదేవి అన్నారు. చర్లపల్లి నాయీబ్రాహ్మణ సంఘం ప్రతినిధులకు శనివారం ఆమె ఈఎస్‌ఐ హెల్త్ ఇన్సూరెన్స్ కార్డులను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆపద సమయంలో ఇలాంటి హెల్త్‌కార్డులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. మార్కెట్ కమిటీ డైరెక్టర్ బాల్‌రెడ్డి, శ్రీకాంత్‌యాదవ్, సంఘం ప్రతినిధులు వినోద్, శివకుమార్, రాజు పాల్గొన్నారు.

మసాజ్ సెంటర్ ముసుగులో వ్యభిచారం

మేడిపల్లి: మసాజ్ ముసుగులో వ్యభిచారం చేస్తున్న ఓ ఇంటిపై పోలీసులు దాడులు నిర్వహించి ఏడుగురిని అదుపులోకి తీసుకున్న ఘటన మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. అంబర్‌పేట్ ప్రేమ్‌నగర్ హనుమాన్ ఆలయ సమీపంలో ఉంటున్న పల్లవి(26) గత కొన్నేళ్లుగా చెంగిచెర్ల ఆర్టీసీకాలనీలో 'షుగర్ బ్యూటీ స్పా' పేరుతో మసాజ్‌సెంటర్‌ను నిర్వహిస్తూ.. నగరంలోని అంబర్‌పేట్, మల్లాపూర్, చిలుకానగర్, నేరెడ్‌మెట్, ఉప్పల్ తదితర ప్రాంతాల నుంచి యువతులను రప్పించి గుట్టుచప్పుడు కాకుండా వ్యభిచారం నిర్వహిస్తుందన్న విశ్వసనీయ సమాచారంతో పోలీసులు శనివారం రాత్రి దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఆరుగురు యువతులు, ఓ విటుడితో పాటు పీర్జాదీగూడ పార్వతీనగర్ కాలనీకి చెందిన నాగరాజు టైలర్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.వేయి, 2 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి యువతులను రెస్క్యూ హోమ్, నిర్వాహకురాలిని రిమాండ్‌కు తరలించామన్నారు.



మల్కాజిగిరిలో ర్యాలీ నిర్వహిస్తున్న ప్రజలు



దుర్గా జ్యోతిష్యాలయంలో..

భారత సైన్యానికి మద్దతుగా..

ఉగ్రవాదానికి వ్యతిరేకంగా మద్దతు ర్యాలీ

గౌతంనగర్: పాకిస్తాన్ ఉగ్రవాదులపై మెరుపు దాడులు చేస్తున్న భారత సైన్యానికి మద్దతుగా శనివారం 'ఫోరం ఫర్ బెటర్ మల్కాజిగిరి' ఆధ్వర్యంలో ఆనంద్‌బాగ్ నుంచి మల్కాజిగిరి వరకు సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుద్యాల ప్రదీప్, ముఖ్య వక్త సూర్యనారాయణమూర్తి, కార్పొరేటర్ గున్నాల సునీతాయాదవ్, గోపు రమణారెడ్డి, ప్రసన్న, శ్రీనివాస్‌ముదిరాజ్, మాశెట్టి అనిల్‌గుప్తా, రాకేష్, అఖిల్ తదితరులు ఉన్నారు.

మురళీనాయక్‌కు నివాళులు..

గౌతంనగర్: పాకిస్తాన్ కాల్పుల్లో మృతిచెందిన మురళీనాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని ఉత్తమ్‌నగర్‌లోని దుర్గా జ్యోతిష్యాలయంలో శనివారం అర్చకులు మూగు నాగరాజుశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించి నివాళులర్పించారు. అనంతరం 'జై జవాన్, జై కిసాన్' నినాదాలు చేశారు.

భారత సైన్యం క్షేమం కోసం..

రామంతాపూర్: భారత సైన్యం చేపట్టిన 'ఆపరేషన్ సిందూర్' విజయవంతమై, భారతసైన్యం క్షేమంగా ఉండాలని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ శనివారం సుదర్శన హోమం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. దేశం, ధర్మం కోసం, దేశ సమైక్యత పరిరక్షణకు వీర జవాన్లలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించడానికి ఈ హోమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

సత్యదేవుని ఆలయంలో..

రామంతాపూర్‌లోని శ్రీరమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో ప్రభుత్వ దేవాదాయశాఖ ఆదేశాలతో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్టీ సభ్యుడు కోట్ల నరసింహారెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ విజయభారతి, అర్చకులు తిరుపతాచార్యులు, శేషాచార్యులు, సీతారామాచార్యులు, శంకర్ పాల్గొన్నారు.



సుదర్శన హోమం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్